TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 68 | 30 బుధవారం సెప్టెంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

స్టాక్ మార్కెట్‌కు వరుసగా

రెండో రోజు నష్టాలు..

సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్



నాతో పెట్టుకుంటే ఆధారాలు

బయటపెడతా...

కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండి పడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయ టపెడ తానని హెచ్చరిం చారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరు క్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. ...మిగతా 2 లో...



రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్.. జాతీయ రాజకీయాల్లో

దుమారం

ఉత్తర, దక్షిణ భారతదేశంపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో వివాదం

తాము ద్రావిడులమని, శివభక్తులమని.. ఉత్తరాది వారు ఆర్యులని, రామభక్తులని వ్యాఖ్య

హిందువులను విడదీసేందుకే రేవంత్ మాట్లాడుతున్నారని బీజేపీ ఆరోపణ

రాహుల్ గాంధీ ఆదేశాలతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారని బీజేపీ విమర్శ

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజల మధ్య మత, రాజకీయ పరమైన గుర్తింపులపై ఆయన చేసిన విశ్లేషణ పెద్ద వివాదానికి దారితీసింది. రాజకీయ లబ్ధి కోసం రేవంత్ రెడ్డి సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ తీవ్రంగా విమర్శించింది.

ఏం జరిగిందంటే..!


జాతీయ రాజధాని ఢిల్లీలో జరిగిన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, బీజేపీ నినాదాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ నేతలు పదే పదే 'జై శ్రీరామ్' అని ఎందుకు అంటారని, అదే తరహాలో 'హర హర మహాదేవ్' అని ఎందుకు నినదించరని ఆయన ప్రశ్నించారు.

...మిగతా 2 లో...


దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ...మిగతా 2 లో...



మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన: ఆ పోలీసులను గుర్తించాలన్న తెలంగాణ హైకోర్టు

- దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీకి హైకోర్టు ఆదేశం
- సంబంధిత పోలీసుల వివరాలను స్పీకర్‌కు సమర్పించాలని సూచన
- వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని వ్యాఖ్యానించిన కో2 లో

బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని

తప్పుబట్టిన కేటీఆర్

చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ

- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న



తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. ...మిగతా 2 లో...

మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్



ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తు న్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ...మిగతా 2 లో...

అదుపుతప్పి మాట్లాడితే

మహిళలతో కొట్టిస్తా: కొండా సురేఖ

- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

కేటీఆర్‌కు సిరిసిల్లలో రేపు సినిమా చూపిస్తాం: చామల కిరణ్ కుమార్ రెడ్డి

- రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల
- సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిరి సిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూ పిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు.

...మిగతా 2 లో...

చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపురాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా..

భారత్ కీలక నిర్ణయం!

-క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు

-ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు

-యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం

-డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి

-సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక

2 లో

TGTEL/26/A5513
వార్తదీపిక

రాముడు-శివుడిపై సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్.. జాతీయ రాజకీయాల్లో దుమారం

మొదటిపేజీ తరువాయి

"మేం ద్రావిడులం. ఇక్కడి (ఉత్తర భారతదేశం) ప్రజలు ఆర్యులు. మేం శివ భక్తులం, ఇక్కడి ప్రజలు శ్రీరాముడి భక్తులు. బీజేపీ రాముడిని దొంగిలించింది. అది ఒక భావోద్వేగం. మోదీ గారు 'హర హర మహాదేవ్' అని ఎందుకు అనరు? బీజేపీ నేతలు వేదికపై ఆ నినాదం చేయడం మీరు ఎప్పుడైనా చూశారా? వాళ్లు కేవలం 'జై శ్రీరామ్' అంటారు. మేం 'హర హర మహాదేవ్' అంటే వారికి నచ్చదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. శివుడిని 'పేదల దేవుడు' అని, రాముడిని 'ధనవంతుల దేవుడు' అని అభివర్ణించిన ఆయన, ఇద్దరు దేవుళ్లను ప్రజలు ఆరాధిస్తారని కూడా స్పష్టం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశ రాజకీయ సంస్కృతులు, సామాజిక గుర్తింపుల మధ్య విస్తృతమైన తేడాలు ఉన్నాయనే వాదనకు బలం చేకూర్చే క్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తీవ్రంగా స్పందించిన బీజేపీ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే హిందువులను విభజించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ సూచనల మేరకు, హిందువులను విభజించడానికి కొత్త మార్గం కనుగొనే ప్రయత్నంలో భాగంగానే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు" అని ప్రదీప్ భండారీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ఆధునిక ముస్లిం లీగ్ కాంగ్రెస్' అని అభివర్ణించిన ఆయన, రాముడు, శివుడి అనుచరుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు ఫలించవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అనేక మతపరమైన, ఆలయ సంబంధిత కార్యక్రమాలను వ్యతిరేకించిందని ఆయన గుర్తుచేశారు. "సోమనాథ్ ఆలయ నిర్మాణాన్ని, కాశీ విశ్వనాథ్ ధామ్ కారిడార్‌ను కాంగ్రెస్ వ్యతిరేకించిన విషయం దేశం మరిచిపోలేదు. 2018లో 'హర హర మహాదేవ్' అని నినదించినందుకు ముగ్గురు పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేసింది" అని భండారీ ఆరోపించారు.బీజేపీ నేతలు 'హర హర మహాదేవ్' అని నినదించరన్న రేవంత్ వాదనను ఆయన తోసిపుచ్చారు. "ప్రధాని మోదీ 'జై శ్రీరామ్'తో పాటు 'హర హర మహాదేవ్' అని కూడా నినదించే ఏకైక ప్రధానమంత్రి. లంకకు వెళ్లే ముందు శ్రీరాముడు స్వయంగా మహాదేవుడికి పూజలు చేశాడని రామాయణంలోని లంకాకాండలో ఉంది. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసేవారికి ఈ విషయం కూడా తెలియదు" అని ఆయన ఎద్దేవా చేశారు. మొత్తంగా రేవంత్ వ్యాఖ్యలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి.

మహిళా ఎమ్మెల్యేలతో దురుసు ప్రవర్తన: ఆ పోలీసులను గుర్తించాలన్న తెలంగాణ హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

మొదటిపేజీ తరువాయి

ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు.ఎన్నికల్లో గెలవలేకే కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేటీఆర్‌కు సిరిసిల్లలో రేపు సినిమా చూపిస్తాం: చామల కిరణ్ కుమార్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మెరుగు రాజయ్య, కుంటాల వెంకన్న లను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

వార్త దీపిక న్యూస్ :

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మంథని మండలం ఖాన్సాయిపేట గ్రామ సర్పంచ్ మెరుగు సురేష్ తండ్రి రాజయ్యని, ఖాన్సాయిపేట గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కుంటాల వెంకన్న ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం నిమ్స్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా అవసరమైన సహకారం అందించాలని వైద్యులకు సూచించారు.



అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా: కొండా సురేఖ


మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు.కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

అంగన్వాడి టీచర్, ఆయమ్మను ఘనంగా సన్మానించిన మంథని బిజెపి నాయకులు

వార్త దీపిక న్యూస్

భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు జరుగుతున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అంగన్వాడి కేంద్రాలను సందర్శించి అక్కడ 3-6 సంవత్సరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ పిల్లల్లో పెరుగుదలను మానిటరింగ్ చేస్తూ బలమైన పౌష్టికాహారం అందిస్తు మహిళలకు గర్భిణీ స్త్రీలకు సలహాలు సూచనలను తోటి ఏఎన్ఎం లతో కలిసి ఇమ్యునైజేషన్ డ్రైవ్ నిర్వహిస్తూ అటు ప్రజల కుటుంబాలకు ఇటు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి టీచర్స్ ని, అంగన్వాడీ ఆయమ్మలను ఘనంగా సన్మానించాలని ఆదేశించగా ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంథని పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో బోయిన్ పేట 6వ వార్డ్ లోని అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నటువంటి అంగన్వాడీ టీచర్ శ్రీ పెరంబదూర్ జావహరి కుమారి ని మా భారతీయ జనతా పార్టీ మహిళా కార్యకర్త పట్టణ కార్యదర్శి దూడపాక రోజా, ఆయమ్మను పట్టణ ప్రధాన కార్యదర్శి ఎడ్ల సాగర్ సతీమణి ఎడ్ల మౌనిక బోయిన్ పేట మహిళా సోదరీమణులు అంగన్వాడి పిల్లలు, మంథని పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమక్షంలో ఘనంగా పూలమాలు,శాలువాతో సత్కరించారు.ఈ చిరు సన్మానం వారిలో మరింత ఉత్సాహాన్ని కల్పిస్తుందని తాము భావించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు బూడిద తిరుపతి, సీనియర్ నాయకులు రాపర్తి సంతోష్, నారమళ్ళ కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఎడ్ల సాగర్, సామల అశోక్, పట్టణ ఓ బి సి మోర్చా అధ్యక్షుడు గుడ్ల గురువేష్, పట్టణ కార్యదర్శి పార్వతి విష్ణు , రమేష్, శ్రీకాంత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'..

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరపున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం

మొదటిపేజీ తరువాయి

ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు.ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

కేటీఆర్‌కు కవిత స్ట్రాంగ్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి

పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.

బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని

తప్పుబట్టిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు.దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

మొదటిపేజీ తరువాయి

ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

సిద్ధివినాయక ఆలయంలో అంగారక చతుర్థి పూజలు

ప్రత్యేక పూజలు చేసిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్

జహీరాబాద్, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

అంగారక చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని రేజింతల్‌లోని శ్రీ సిద్ధివినాయక ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ఆలయాన్ని సందర్శించి విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న శివకుమార్‌కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నరసింహులు, వైద్యనాథ్, హద్నూర్ సర్పంచ్ ప్రవీణ్, బిఆర్ఎస్ నాయకులు రాజేందర్ రెడ్డి, అరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిర్మల జగ్గారెడ్డి పర్యటన





సంగారెడ్డి, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

అంబేద్కర్ స్టేడియం లో నేషనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ ఎంపిక ప్రక్రియ లో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ప్రైడ్ ఆసుపత్రిలో మెకానికల్ సీపీఆర్ పరికరాన్ని నిర్మల జగ్గారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఆమె పరిశీలించారు. నవంబర్ 14, 16 తేదీల్లో జిల్లాలోని వోక్సెన్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ అలీ, కార్యదర్శి జావిద్ అలీ, రవి, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైడ్ హాస్పిటల్‌లో ఆధునిక వైద్య పరికరాల ప్రారంభం

అనంతరం పట్టణంలోని ప్రైడ్ హాస్పిటల్‌లో నూతన వైద్య పరికరాలను నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే మెకానికల్ సీపీఆర్ పరికరాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే గుండెలోని రక్తనాళాల్లో వాల్వ్ బ్లాకేజీ పరిమాణాన్ని గుర్తించేందుకు ఉపయోగపడే ఆధునిక వైద్య పరికరాన్ని కూడా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా, మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, డాక్టర్ అనిల్,నాయకులు ప్రవీణ్, కూన వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఇంట్లో చోరి

తాండూర్, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

యలాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, తాండూర్ నుండి కొడంగల్ వెళ్లే రోడ్డులో గౌతమి స్కూల్ దగ్గర ఆర్టీసీ కండక్టర్ చందర్ నాయక్ ఇంట్లో దొంగతనం జరిగింది. బీరువా పగలగొట్టి రెండున్నర తులాలు బంగారం, 70 వేల రూపాయలు నగదు దొంగిలించారు. ఆర్టీసీ కండక్టర్ చందర్ నాయక్ భార్య ఇంటికి తాళం వేసి తాళపు చెవిని ఇంటిముందులో ఉన్న తులసి కట్టులో తాళపు చెవి ఉంచి బయటకు వెళ్లడం జరిగింది.తర్వాత దొంగ వచ్చి తాళము తీషి తలుపును తెరిచి బీరువా పగలగొట్టి దొంగిలించడం, ఇది తెలిసిన వారి పనే అని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న యాలాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించి విచారణ జరుపుతున్న పోలీసులు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సంగారెడ్డి, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

మండల పరిధిలోని ఫసల్‌వాడి గ్రామ శివారులోని జాతీయ రహదారి-161పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ గ్రామానికి చెందిన ఈర్ల అంజనేయులు కుమారుడు ఈర్ల అభినయ్ (21) గత ఆరు నెలలుగా సంగారెడ్డిలోని ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున డ్యూక్ మోటార్‌సైకిల్ నెంబర్ టిజి 15 సి 0342 పై విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. ఫసల్‌వాడి శివారులో జాతీయ రహదారి 161పై ఒక కంటైనర్ లారీ నెం బర్ జిజే 03 సి డబ్ల్యు 8383 రోడ్డుపై అడ్డంగా పడివుంది. లారీ డ్రైవర్ వాహనం చుట్టూ ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకపోవడం, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో చీకటిలో అభినయ్‌కు లారీ కనిపించకపోవడంతో అతని మోటార్‌సైకిల్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అభినయ్‌కు ముఖం, తల ఎడమ చేతికి తీవ్ర గాయాలు కావడంతో రక్తస్రావం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే 108 అంబులెన్స్ ద్వారా అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు అభినయ్ అత్యవసర విభాగంలో స్ట్రెచర్‌పై మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఈర్ల అంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలు, కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు చేపట్టారు.



బీసీ స్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూర్, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గం పరిధిలో అన్ని బీసీ స్మశాన వాటికలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ పట్టణంలోని ప్రధాన బీసీ స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 10 లక్షలు నిధులు విడుదల చేశామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతోపాటు స్మశాన వాటికను పరిశుభ్రంగా సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే పాత తాండూర్ లోని 14 వ వార్డు బోనమ్మ టెంపుల్ సమీపంలో ఉన్న స్మశాన వాటికలో ఏడాది క్రితమే బోరు వేశామని నీటి సదుపాయం కల్పించామని గుర్తు చేశారు, కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినట్లు, త్వరలోనే ఆ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బుయాని మనోహర్ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గంలోని బీసీ స్మశానవాటికలను అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజబాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాకేష్, కౌన్సిలర్లు, బీసీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక గుండె వైద్య సేవలకు శ్రీకారం



సంగారెడ్డి, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లాలోనే తొలిసారిగా అధునాతన మెషిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ తూర్పు నిర్మల జగ్గారెడ్డి హాజరై మెషిన్‌ను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ జిల్లాలోనే తొలిసారిగా సాంకేతికత అందుబాటులోకి రావడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో మరింత ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. గుండె రక్తనాళాల్లోని సమస్యలను మరింత స్పష్టంగా గుర్తించేందుక సాంకేతికత ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. సాంకేతికత ఏమిటి? అనేది ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ సాంకేతికత. ఇందులో ప్రత్యేకమైన కాథెటర్ ద్వారా రక్తనాళాల లోపలికి వెళ్లి, నాళాల గోడలు, ప్లాక్ నిల్వలు, స్టెంట్ స్థానం వంటి వివరాలను అత్యంత స్పష్టంగా చూపిస్తుంది. సాధారణ యాంజియోగ్రఫీ కంటే ఇది మరింత ఖచ్చితమైన సమాచారం అందిస్తుంది. దీని వల్ల వైద్యులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవచ్చు. చికిత్స ఫలితాలు మెరుగుపడతాయి. జిల్లాలో ఇలాంటి ఆధునిక పరికరం రావడం వల్ల రోగులు హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆసుపత్రి అధికారులు అభిప్రాయపడ్డారు. గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవ జిల్లా ప్రజలకు గొప్ప ఊరట కలిగిస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూన వేణుతో పాటు పలువురు ప్రముఖులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ అనిల్ కుమార్, అభిలాష్, నిహార్ బాబు, నరేష్ తదితరులు హాజరయ్యారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం జిల్లా ఆరోగ్య రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అందరూ అభిప్రాయపడ్డారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

ప్రమాద స్థలాల పరిశీలన సీపీ ఎన్.శ్వేత

వరంగల్, , సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

రోడ్డు ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై 14 ప్రాంతాలను మరియు వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై 8 ప్రాంతాలను ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించి, పరిశీలించారు. ఆధికారిక లెక్కల ప్రకారం గడిచిన మూడు సంవత్సరాలలో వరంగల్ కమిషనరేట్ పరిదిలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి లో 108 రోడ్డు ప్రమాదాలు జరిగి, అందులో 80 మంది మరణించినట్లు, వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై 79 రోడ్డు ప్రమాదాలు జరిగి, అందులో 37 మంది మరణించినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రతా చర్యలను తక్షణమే చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను సీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఆర్ అండ్ బి, మున్సిపల్, రవాణా, ఎక్సైజ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

హాస్టల్ లో వసతులు మెరుగ్గా ఉండాలి

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





హనుమకొండ, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్

హాస్టల్ లో విద్యార్థులకు మెరుగైన వసతులు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజారు లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆకస్మిక తనిఖీలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని కిచెన్ రూమ్ ను పరిశీలించారు. వంట గదిలోని నిత్యావసరాలు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు అందించే మెనూ చార్ట్ ని పరిశీలించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థుల దగ్గరికి వెళ్లి పెట్టిన బ్రేక్ ఫాస్ట్ గురించి ఆరా తీశారు. స్నాక్స్, గుడ్లు పెడుతున్నారా అని,అలాగే టీచర్స్ వస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులకు సంబంధించి వివరాలను విద్యార్థులను అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయనందుకు అలాగే క్లాస్ రూమ్ లో ఫ్యాన్ రిపేర్ చేయించనందుకు హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ ను కలెక్టర్ మందలించారు. చివరగా విద్యార్థులకు సంబంధించిన టాయిలెట్స్, డార్ మెంట్రీ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. ప్రతి పూట నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వంట తయారీలో నాణ్యమైన నిత్యావసర వస్తువులను, తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. తరగతి గదులు అన్ని కూడా పరిశుభ్రంగా, విద్యార్థులకు అనుకూలమైనవిగా ఉండాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో నేర్చుకున్నవి భవిష్యత్ జీవితంలో స్థిరపడడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా పని చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్ దీప ని కలెక్టర్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

తాండూర్, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం కోసమే వార్డులో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. మంగళవారం 1 వార్డు నుండి 6 వార్డు వరకు కాలినడకన పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కలువాలా శుభ్రత,కొత్త డ్రైనేజీలు, సిమెంటు రోడ్ల నిర్మాణం చేయాలని కాలనీవాసులు విన్నవించుకున్నారు, వీధుల్లో చెత్త పేరుకుపోవడం వల్ల దారులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయని వీధిలో ఎటువంటి చెత్తా వేయకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ నీరజ ఆయా కాలనీవాసులను కోరారు.కొన్ని కాలనీలో విద్యుత్ దీపాలు లేక రాత్రివేళ ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వివరించారు. వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్లు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త శేఖర్ ఆత్మహత్య

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

జిల్లాలోని కోహీర్ మండలం బిలాల్‌పూర్‌కు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త శేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ కేసు విషయంలో పోలీసులు నిన్న తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ లు బాధిత కుటుంబానికి మద్దతుగా రంగంలోకి దిగారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శేఖర్ కుటుంబసభ్యులతో కలిసి జాతీయ రహదారిపై దాదాపు 3 గంటల పాటు భారీ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. శేఖర్ ఆత్మహత్యకు కారకులైన జహీరాబాద్ పట్టణ ఎస్సైతో పాటు సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని ఇక్కడి నుండి తీసుకెళ్లేది లేదని ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తమ్ లు డిమాండ్ చేశారు.

సంగారెడ్డి నుండి మదీనగూడ రోడ్డు విస్తరణ పనులను పరిశీలన

రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి, ప్రజలకు ఇబ్బందులేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి, సెప్టెంబర్ 29, వార్త దీపిక న్యూస్ :

సంగారెడ్డి చౌరస్తా నుండి మదీనగూడ వరకు జాతీయ రహదారి--65పై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనుల పురోగతిని ఆర్‌డబీ ఇంజినీర్లు, సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తికావడంలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను తెలుసుకుని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనుల ఆలస్యం కారణంగా ప్రజలకు, వాహనదారులకు, రోజువారీ జనజీవనానికి ఇబ్బందులు కలుగుతున్నాయని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల సమయంలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రమాదాలకు తావులేకుండా తగిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలు, సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, రూరల్ ఇన్‌స్పెక్టర్ నాయిముద్దీన్, ఆర్‌డబీ ఇంజినీర్లు, సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్లు తదితరులు ఉన్నారు.





శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలన

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి:

అంగారక సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని రేజింతల్లోని సిద్ధి వినాయక ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆలయాన్ని సందర్శించి భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీ లించారు.

ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, భక్తుల భద్రత, రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను పరిశీలిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున క్యూలైన్ల నిర్వహణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్లేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డిఎస్పీ సైదా నాయక్, రూరల్ ఇన్స్పెక్టర్ హనుమంతు, ఎస్ఐ లు సుజిత్, క్రాంతి పాటిల్ ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది

కూన శ్రీశైలం గౌడ్

వార్త దీపిక న్యూస్ :

రోడమేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ (దర్బార్ మైసమ్మ బస్తీ)లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.27 లక్షల నిధులు మంజూరు కాగా, సోమవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తగిన స్థాయిలో నిధులు కేటాయించలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేయడంపై బస్తీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు స్థానికంగా ఎదురవుతున్న రహదారి సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ అధినేత, మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, బస్తీ వాసులు సత్యనారాయణ, ప్రసాద్, రమేష్, వేణు, శ్రీను, అలీతో పాటు కాంగ్రెస్ నాయకులు కాజా, బలరాం, రాజిరెడ్డి, రఘురెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ నగర్‌లో రూ.27 లక్షలతో

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984